"ఈ వెంకటస్వామి ఎప్పుడూ ఇంతే. ఎద్దు బండిలా గ తోలుతాడు కారు!" విసుక్కుంది - బీ-కారు సిగ్నల్ కోపం ఆగింది.

"ఆరేంజిలో దాటితే పోలీసు కాపే స్తారు. అప్పుడు నీకు యింకా ఆలస్యం అవుతుంది. ఇందుకే ఓ అయిదు ము షాలు ముందు బయలుదేర మం" అంటూనే పక్కనే కూర్చున్న క తురి ముఖంలోకి ఓరకంట చూసింది. బేబీ ముఖంలో విసుగు కోపం-దాగడంలే.

"అదిగో మొదలు పెట్టావా సాధి పు" విసురుగా ముఖాన్ని బయటకి తిప్పు ంది బేబీ. ఆవిసురుకి, కట్టుకున్న పో టేల్ అటునుంచి యిటు పడింది - పొగర తు గుర్రం తోక విదిలించినట్టుంది.




కె. రామలక్ష్మి

# ఎదిగే కాలం

పార్వతి బేబీకేసి చూసింది. డాన్సు క్లాసుకోసం వేసుకున్న షల్వారు కమీజులో ఎవరో కొత్త పిల్లలాగ అనిపించింది. కిందటేడాదిలో మూడంగుళాలు పెరిగింది బేబీ. వన్నెవి వంపులు వచ్చేరానట్టు కన్పిస్తున్నాయి. పన్నెండుదాటి పదమూడులోకి అడుగెట్టింది. అరపాదడపా ముఖం మీద వెలిసే ఒక పింపుల్, పలువరస వంకర పోడానికి డాక్టరుగారు అమర్చిన వంత వైర్లు.... బేబీ పెద్దదై పోతూంది. నిట్టూర్చింది పార్వతి.

ఈమధ్య ఆదేమిటో తరుచు బేబీని చాలా పరిశీలనగా చూస్తూ వుండి పోతోంది పార్వతి. "ఈచిన్నపిల్ల కాస్తా పెద్దదై పోతోందే" అని బెంగగా వుంటూందామెకి. వింతగా తనపాప తనకి దూరమై పోతూందని పించుతూంది. ఇంట్లో ఆ అల్లరి ఈ అల్లరిచేస్తూ అలరించే బేబీ మాయమై పోయింది. శరీరంలో పొడ చూపుతున్న మార్పుతో పాటు బేబీ తత్వం కూడా మార్పులోకి అడుగెట్టడం పార్వతికి బాధగా వుంటోంది.

కారు కూచిపూడి అకాడమీదగ్గర ఆపాడు వెంకటస్వామి. దిగి వెళ్ళిపోతున్న బేబీని చూస్తూ "ఓ. గంటన్నర తరవాత వస్తాను వెంకటస్వామి" అంది పార్వతి—మళ్ళీ ఒకసారి విసురుగా తల్లి కేసి తిరిగింది బేబీ.

"నీకు మతిమరుపు ఎక్కువై పోతోంది మమ్మీ. నేనూ రత్నా నడిచివస్తాం అని చెప్పాముగా?" ఆ కంఠంలోనూ కళ్ళలోనూ కూడా విసుగు. "ఓ. సారీ, చూశావా మరిచి పోయాను. సరి, జాగ్రత్తగా రండి. చాక్లెట్లు కొనకేం?" నవ్వను కుంటూనే హెచ్చరించకుండా వుండలేక పోయింది పార్వతి.

"మమ్మీ!!" విసుగ్గా అని విసురుగా గేటు తెరుచుకొని వెళ్ళింది బేబీ.

"సాధించకూడదు అనుకుంటూనే ఎందుకిలా చెప్తానో" సగం స్వగతంగా అనుకుంటూ "పోదాం పద" అంది డ్రైవరుతో - "నానిగాడైంది - బాబిగాడైంది. ఇప్పుడిక బేబీవంతు కాబోలు-తల్లిదండ్రులు ఏం చెప్పినా అది సాధించడం అనుకోడానికి" అనుకుంటూ సీటుకి జారబడింది.

"ఇంటికేనా అమ్మా" అడిగాడు.

"ఇంటికే- అమ్మాయి నడిచి వస్తానందిగా...." అంది పార్వతి.

"నిన్న మొన్నటిదాకా చిలకపలుకుల్తో, నా చుట్టూ తిరిగే బేబీ. ఇప్పుడేమైంది? నా మాటలంత శ్రద్ధగా వినే బేబీకిప్పుడు నేనేం చెప్పినా విసుగూ కోపం ఎందుకొస్తున్నాయి?" తనని తనే ప్రశ్నించుకుంటూ కళ్ళు మూసుకుంది పార్వతి.

o o o

ఇల్లు ఖాళీ- మగ కుర్రాళ్ళు హాస్టలు. కృష్ణమూర్తి క్యాంపు. ఇకఏముంది ఇంట్లో- నిశ్శబ్దంతప్ప? అనుకుంటూ "కారు పెట్టేసి నువ్వెళ్ళు. నాకింక అవసరంలేదు" అని చెప్పి లోపలికి నడిచింది పార్వతి. కారు చప్పుడు విని కాబోలు- కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది నూకాలు. "నువ్వు లేకపోతే నేనేమైపోతాను నూకాలూ!" అనాలని పించింది. "కాని తీరా అలా అంటే దానికి అర్థంకాదు. నేను దేనికో బాధపడుతున్నాననుకుంటుంది". నవ్వుకుంటూ కాఫీ అందుకుంది పార్వతి.

"బాగా మబ్బు కమ్మింది. వెంకటస్వామిని వుండి బేబీని తీసుకురమ్మను." హెచ్చరించింది నూకాలుకి. బేబీ ముఖం కళ్ళముందు కన్పించింది పార్వతికి.


"ఫరవాలేదు నూకాలూ, రానీవే" అంది.

చూస్తూండగానే దట్టమైననల్లని మేఘాలు నేలకి దిగాయా అన్నట్టు చీకటిపడిపోయింది. ఉరుములు మెరుపులు ఆకాశంలో గందరగోళం. "వస్తుందిలే" అని అన్నదన్నమాటేగాని, పార్వతి మనస్సంతా బేబీ మీదే వుంది. పౌరుషం అడ్డు నిలవకపోతే వెంకటస్వామిని బేబీకోసం పంపేదా? అసలే బేబీకి ఉరుములంటే భయం. ఇలాంటి వాతావరణంలో ఎలా వస్తుందోనన్న బెంగ ఒక వేపూ, బేబీ ముఖంలో ప్రతిసారీ కన్పిస్తున్న కోపం. విసుగు, నిర్లక్ష్యం, ఇవన్నీ యింకొకవైపూ- పార్వతిని కాలు నిలవనీయడంలేదు. కిటికీల రెక్కలు కొట్టుకోకుండా నూకాలు మూయడానికి అవస్థపడుతోంది.

ఇంతల్లో విసురుగా తలుపు తెరచుకుంది. నిలువెల్లా నీళ్ళు కారుతూ బేబీ లోపలికి అడుగుపెట్టింది. హాల్లో కార్పెట్ తడుస్తోంది. మామూలు పరిస్థితిలో అయితే- చెప్పేదే పార్వతి. కాని ఇప్పుడు వేరు.... తిన్నగా లోపలి గదిలోకి నడుస్తూ

"రత్న అమ్మగారు వచ్చారు— కారేసుకుని— అప్పటిదాకా హాయిగా పొడిగాఐనా వున్నాం. కారు దగ్గరికి పరుగెత్తి ఎక్కి- దిగి- దిగిఎక్కేవరికి తడిసి ముద్దఅయాం, మైగాడ్. మాకసలు బుర్రలేదనుకుందా ఏం. ఆ ఆంటీ?" గదిలో దూరి తలుపు దభీమని వేసేసింది బేబీ.

పార్వతీ, నూకాలూ ముఖం ముఖం చూసుకున్నారు? ఏదీ? బేబీ ఏమైపోయింది, ఈపిల్ల నా బేబీ యేనా? అనుకుంది నిట్టూరుస్తూ పార్వతి- పసితనం నుండి యౌవనంలోకి అడుగెట్టిన ఇద్దరు కొడుకుల్ని చూసిన పార్వతికిది కొత్తకాదు. కాని ఇంత హఠాత్తుగా ఈ మార్పు వచ్చినందుకే— ఆశ్చర్యం, ఇంత త్వరగా వస్తుందని ఆమె




ఎదురు చూడలేదు. అంతే.

o o o

ఆరాత్రి బేబీగదిలో లైటింకావెలు తూ వుండడంచూసింది పార్వతి. లేచి వెళ్ళింది. మంచంమీద పడుకుని సీలింగు చూస్తోంది బేబీ. ఆ చూపులో- అంతుపట్టని ఆవేదన.

"ఏం బేబీ!" అంటూ మంచం అంచున కూర్చుంది పార్వతి.

సమాధానం రాలేదు.

"నాకు చెప్పకూడదా?" అంటూ చన్నంగా వున్న బేబీ చేతివేళ్ళని తన చేతి లోకి తీసుకుంటూ నిమిరింది పార్వతి

బేబీ నెమ్మదిగా లేచి కూర్చుని తల్లి ముఖంలోకిచూసింది. చూస్తూండగానే ఆమె గెడ్డం దుఃఖంతో ఒణికిపోయింది. "మమ్మీ...." అంటూ ఏడుస్తూ తల్లి ఒడి లోనే ఒదిగిపోయింది.

బేబీ తల నిమురుతూ, "ఏమైంది బేబీ. చెప్పు...." బ్రతిమాలుతున్నట్టుగా అడిగింది పార్వతి.

"మమ్మీ ఈ రోజు బస్టాండు దాకా నడిచి వస్తూంటే...."

"ఏమైంది?" ఆత్రంగా అడిగింది పార్వతి-

"గోపీ ఎదురై పలకరించాడు." ఉత్సాహంగా అంది.

"ఏ గోపీ? సుందరి కొడుకా?" తెలిసే అడి గింది పార్వతి. చాలా రోజుల తరువాత తన కూతురు తనతో- మనసువిప్పి మాట్లాడుతూన్నట్టుగా అనిపించింది పార్వతికి-

"నిన్ను అడిగాడు- ఇంకా సరదాగా మాట్లాడుతూండగానే రత్నా వాళ్ళమ్మ వచ్చింది...." వూరుకుంది బేబీ. రత్నా వాళ్ళమ్మ రావడానికీ గోపీ మాట్లాడడానికీ ఏమిటి సంబంధం? తనలో తనే ప్రశ్నించుకుంది పార్వతి. సమాధానం దొరకలేదు.

"గోపీ ఎప్పుడూ మాట్లాడుతాడు కదా?"

"లేదు-నాతో రత్నతో మాట్లాడినట్టు మాట్లాడడు..... నన్ను.... చూసినా చూడనట్టు వూరుకుంటాడు...."

"కొందరు మగపిల్లలకి అమ్మాయిలతో మాట్లాడ్డానికి సిగ్గుగా వుంటుంది బేబీ."

"అదేంకాదు. నేను వాళ్ళలాగా బాగా లేను అందుకు...."

"ఛఛ. నీకేంలోటు బేబీ? నీ కళ్ళొక్కటే చాలు...." అన్నాను.

"లేదు. లేదు. నేను అందంగా వుండను. నన్ను చూడు" అంటూనిటారుగా కూర్చుంది బేబీ, ఒంటికి అంటుకు పోయింది వేసుకున్న గౌను.

"నన్నుచూడు- అసహ్యంగా లేనా?" అడిగింది. ఎదగడానికి ముందు ఎవరూ అందంగా వుండరని చెప్పాలనిపించింది పార్వతికి. కాని ఏమో.... యీ చనువు యీ స్నేహం-పోతుందేమో, మటుమాయం అవుతుందేమోనని భయంవేసి- వూరుకుంది క్షణంసేపు.

"చూడు మమ్మీ నేనెలా వున్నానో" వస్తూన్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అంది బేబీ.

బేబీని యిలా బాధపెడుతున్నది, బేబీయే. మారుతున్న బేబీకీ, యింకా మారని బేబీకీ జరుగుతున్న సంఘర్షణలో నలిగి పోతూంది!

"పిచ్చిదానా? ఎవరన్నారు మన్ను అందంగా లేవని? వయసుతోపాటు వచ్చే అందచందాలు ముందే ఎలా వస్తాయి? నీ మనసంత వేగంగా కాలం పరిగెత్తకలదా?" బేబీ తల నిమురుతూ అంది పార్వతి.

"వుండు-నీకొకటి తెచ్చి చూపిస్తాను." అంటూ లేచి గబగబా తన గదిలోకి వెళ్ళింది పార్వతి.

"ఏమైందమ్మా! బేబీ ఏడుస్తోందా?" ఆత్రంగా అడిగింది నూకాలు. దాని ఆత్రానికి నవ్వుతూ, "ఏంకాదే నూకాలూ. బేబీ అందంగాలేనని బాధపడి పోతోంది అంచేత దానికి ధైర్యం చెప్పడానికి-ఒకటి చూపిస్తున్నాను" అంటూబీరువాలోంచి చీరల అడుగునుంచి తీసిన ఓపాత ఫొటో దానికి చూపించింది.

"ఎవరమ్మా" ఆశ్చర్యంగా అడిగింది నూకాలు.

"ఆలోచించి చెప్పు. ఇప్పుడేవస్తా" నంటూ తిరిగి బేబీ గదిలోకి నడిచింది.

మంచం నడిబొడ్డున అలాగే కూర్చుని వున్న బేబీ "ఏమిటి మమ్మీ అది" అంటూ చేయిజాపి అందుకుంది. చేతిలో ఉన్న పాత ఫొటోకేసి కన్నార్పక చూస్తూంది బేబీ. ఆ ముఖంలో వెటకారపు నవ్వు. వింత కుతూహలం పరచుకున్నాయి. పార్వతీ కుతూహలంగా ఆ బొమ్మకేసి చూడ సాగింది. బొద్దుగా వున్న ఆ బొమ్మలో అమ్మాయి పరికిణీ జాకెట్టు వేసుకుంది.

ముఖంలో కాని శరీరంలో గాని ఏ రకమైన ప్రత్యేకతా కనపడడంలేదు భుజాల దగ్గిర నుండి పాదాలదాకా- ఒకటే దబ్బాషేప్.

"నేనేనా!" పార్వతి ఆశ్చర్యపడింది.

"మమ్మీ నువ్వెంతగా మారావు!.... ఒక వేళ మారి వుండకపోతే?" బెరుకుగా అడిగింది బేబీ.

"మారడం-సహజం బేబీ- అది అదో యిటో చెప్పలేం- అంతే."

అవునన్నట్టు తలూపింది బేబీ. కానీ బొమ్మమీద నుంచి దృష్టిని మళ్ళించకుండానే.

"నువ్వు ఎదిగి చాలాఅందంగా మారావు మమ్మీ-" అంది నవ్వుతూ. ఆ క్షణంలో నోట్లో వున్న క్లిప్పు సంగతి మరిచిపోయి నందుకు మురిసిపోయింది పార్వతి. యీ క్లిప్పు పెట్టాక బేబీ నవ్వడం మానేసింది!

"నేనేమిటి- అందంగా వుండడం ఏమిటి ఎవరేనా వింటే నవ్వుతారు" అందిపార్వతి తేలికగా కొట్టిపారేస్తూ.

"ఫోసీలే- అందంకాదు ప్రెట్టీ" అంది బేబీ. "బొమ్మలో కూడా నువ్వు మంచి పిల్లలా కన్పిస్తున్నావు" అంది.

"నువ్వూ అంతే." అంది పార్వతి బేబీ తలమీద చేయివేసి. విప్పారినకళ్ళతో తల్లి ముఖంలోకి చూసింది బేబీ.

దగ్గిరగా తీసుకుని పెద్దదైపోతూన్న తన కూతుర్ని గుండెలకి హత్తుకుంది పార్వతి.

"నువ్వూ అందంగా తయారవుతావు బేబీ. ఎదిగీఎదగని వయసులో- ప్రకృతిలో ఏ జీవీ అంత అందంగా వుండదు. గూడు కట్టిన గొంగళీ ఎదిగేకద సీతాకోకచిలుక? అందమైన హంస పిల్లగా వున్నప్పుడు-ఏం బాగుంటుంది!" కూతురిజుట్టులో తనముఖం దాచుకుంటూ చెప్పింది పార్వతి.

మంత్రముగ్ధురాలినిచేసి ఆ క్షణం తనని కట్టిపారేసిన కూతురి అమాయకత్వం, పిరికితనం, తెలియని ఏదో భయం.... వివశను చేశాయి పార్వతిని. కాని మరుక్షణం— తెలివి వచ్చింది. కూతురి మాట విని.

"సిల్లీ. మరీ చిన్నపిల్లని చూస్తున్నట్టు చూస్తున్నావు నన్ను మమ్మీ....నన్ను బేబీ అని పిలవకు రేపటినుంచి...." అంటూ హెచ్చరించి తల్లి కౌగిలి విడిపించుకుని మంచం మీదకు జరిగింది బేబీ. క్షణంలో తమమధ్య దూరం- ఎంత పెరిగిపోయిందో గ్రహించిన పార్వతి నవ్వేస్తూ—

"సరే. రేపటినుంచి నిన్ను దుర్గా అనే పిలుస్తాను. లైటార్పి పడుకో" అంటూ గది దాటింది. ఆమె చెవులకి- బేబీ విసుక్కోవడం విన్పించింది-"ఫన్నీపేరెంట్స్! ఎక్కడ వెతుక్కొస్తారో యీ పేర్లు!"....

నవ్వుకుంటూ తలుపులు జేరవేసింది పార్వతి.

✽

